# మీ ప్రేమ కోసం చెప్పరూ!

## అంధవరపు మల్లిబాబు

అసుర సంధ్యావేళ—

డాబా మీద వాలు కుర్చీలో కూర్చుని అనంతాకాశంలోకి నిస్తేజంగా చూడసాగాడు మురారి. అతనికెదురుగా టీపాయ్, సగంఖాళీ అయిన 'జానీవాకర్' గ్లాసు,సోడాలు మొదలయిన సరంజామా వుంది.

"మీరిక్కడ వున్నారా?" సుపరిచితమైన గొంతు విని మురారి ఉలిక్కిపడుతూ దృష్టి మరలించాడు.

ఎదురుగా సంధ్య.

తెల్లని పోలిస్టర్ చీరలో అప్పుడే విరిసిన మల్లెలాగ వుంది.

"మీ గురించి మధ్యాహ్నం నుండి ఎదురుచూస్తూంటే తీరికగా ఇక్కడ కూర్చొని మీరు చేసే పని ఇదా?" అంది సంధ్య.

పేలవంగా మందహాసం గావించాడు మురారి.

"ఈరోజు నా బర్త్‌డే. పోనీ ఆ విషయం గుర్తుందా!" మురారి ముందున్న 'మందు' సరంజామాను చూస్తూ, బాధగాఅందిసంధ్య.

"సారీ సంధ్యా! నిజంగా గుర్తు లేదు..." మురారి నొచ్చుకొన్నాడు.

అతని మాటలకు సంధ్య మొహం చిన్నబోయింది.

"అవునులెండి! మాలాంటి అనామకుల ఆహ్వానాలు మీవంటి పెద్దలకు ఎలా గుర్తుంటాయి?" అంది నిష్ఠూరంగా.

"నువ్వంత ఘోరంగా మాట్లాడకు సంధ్యా! నిజంగా మరచిపోయాను. నిన్ను మించిన సన్నిహితులు, స్నేహితులు నాకెవరున్నారింక? రియల్లీ ఐయామ్ వెరీసారీ!" అన్నాడు మురారి.

సంధ్య నిట్టూర్చింది.

పౌర్ణమి రాత్రి. వెన్నెల పిండి ఆరబోసినట్టుగా వుంది. చల్లటిగాలి వీస్తోంది. సంధ్యకు హాయిగా అనిపిస్తోంది. నుదుటి మీద పడుతున్న ముంగురులను కుడిచేత్తో సవ



రించుకుంటూ పిట్టగోడను ఆనుకుని కూర్చుంది సంధ్య.

మురారి సిన్మా రచయిత.

సంధ్య సినిమాల్లో చిన్న చిన్న వేషాలను ధరించే ఎగ్‌స్ట్రా నటి. ఇద్దరూ అవివాహితులే.

సినిమారంగంలో ప్రవేశించిన సంవత్సరంలోపే మురారి రచయితగా మంచి పేరు సంపాదించుకున్నాడు. అతడు స్క్రిప్ట్ వ్రాసిన నాలుగు సినిమాలు వరుసగా హిట్ అయ్యేసరికి అతడికి డిమాండ్ పెరిగిపోయింది.

సంధ్య, మురారి ఒకే వీధిలో వుండటం వలన ఇద్దరూ సినిమా రంగానికి చెందిన వ్యక్తులు కావడం వలన వాళ్ళమధ్య చెప్పుకోదగ్గ 'పరిచయం' వుంది.

"ఇంకా ఎన్నాళ్ళిలాగ ఒంటరిగా గడుపుతారు? పెళ్ళి చేసుకోరాదూ?" అని ప్రశ్నించింది సంధ్య.

"పిల్లనెవరు ఇస్తారు?"అన్నాడు నవ్వుతూ.

"ఎందుకివ్వరు? రచయితగా పేరు ప్రఖ్యాతులున్నాయి .సంపాదన వుంది. మీకేం తక్కువయిందని?"

"తక్కువైందని కాదు సంధ్యా! ఎక్కువైందని."

"ఏమిటి?"

"నా వయస్సు!"అని నవ్వాడు. "నువిప్పుడు చెప్పినవన్నీ నిజమే గానీ నాకిప్పుడు ఎంత వయసు వుంటుందని అనుకుంటున్నావ్?" అన్నాడు మళ్ళీ పేలవంగా నవ్వుతూ.

సంధ్య మౌనం వహించింది.

"దాదాపు నలభై, ఇంత వయస్సొచ్చాక ఎవరు పిల్లనిస్తారు? ఎవరు పెళ్ళాడతారు?" అన్నాడు. అతడి మాటల్లో ఏదో ఆవేదన తొంగిచూసింది.

"వయస్సు ఎక్కువైనంత మాత్రాన మీవంటి వాటికి పెళ్ళి ఒక ప్రోబ్లమ్ అవుతుందనుకోను."

మురారి గ్లాసుని ఖాళీచేసి సిగరెట్ వెలిగించుకున్నాడు.

"మీ ధోరణి చూస్తుంటే అసలు మీకు పెళ్ళంటే ఇష్టం లేనట్టుగా వుంది" వెన్నెల వెలుగులో మురారి ముఖకవళికల్ని పరికించడానికి ప్రయత్నిస్తూ అంది సంధ్య.

మురారి మౌనంగా మళ్ళీ గ్లాసు నింపుకుని, "ఆశించినవి జరగనపుడు కొందరు వాటిని తట్టుకోలేరు సంధ్యా! జీవితం మీద ఆ సమయంలో విరక్తి కలుగుతుంది. కానీ, చావడానికి వాళ్ళకు ధైర్యం సరిపోదు. జీవచ్ఛవాల్లాగా మిగిలిపోతారు" అన్నాడు.

మురారి మాటలకు విస్మయంగా చూసింది సంధ్య.

"అంటే? మీ మాటలు నాకర్థం గావడం లేదు"

"తెలుగు సినిమా ప్రేమకథ లాంటిది నాకూ ఒకటి వుంది సంధ్యా!"

"నిజం?" నమ్మ లేనట్టుగా అంది.

తలూపాడు మురారి.

"మీ ప్రేమకథ చెప్పరూ?" అంది విశాలమైన తన కళ్ళను మరింత విశాలంగావిస్తూ.

బరువుగా నిట్టూర్చాడు మురారి.

మురారి ప్రేమ కథ:

"బియ్యే పాసయి, ఉద్యోగం కోసం నేను ప్రయత్నిస్తున్న రోజులవి. మా యింటి ప్రక్కనే రిటైర్డ్ తాహసీల్దారు వుండేవారు. వాళ్ళమ్మాయి పేరు లత. పేరుకు తగ్గట్టుగా సన్నగా, నాజూగ్గా లత లాగే వుండేది. లతకు నేనంటే చాలా యిష్టం. నేను అప్పట్లో పత్రికలకు కథలు వ్రాస్తుండేవాడ్ని. నా కథల్ని చాలావరకు లత ఫెయిర్ చేస్తుండేది. రోజులు గడుస్తున్న కొద్దీ మామధ్య మొలకెత్తిన ప్రేమ పెరిగి పెద్దదవసాగింది. నాకు ఉద్యోగం దొరకగానే....ఇద్దరం పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాం. ఈ విషయం మా యింట్లో తెలియదు. తెలిసినా ఫరవాలేదు. మా నాన్న అభ్యంతరం చెప్పే మనిషి కాదు. ఇకపోతే లత యింట్లో మాత్రం ఒప్పుకోరు. లత తండ్రి పూర్వకాలపు మనిషి. మామధ్య అంతస్తుల అడ్డుగోడలే కాకుండా కులాల యినుపతెరలు కూడా వున్నాయి. అందుచేత 'రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుందా' మంది లత.

'సరే' నన్నాను.

అప్పట్నుంచీ ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు చేసాను. రోజులు. వారాలు.... నెలలు...గడుస్తున్నాయి తప్ప, నా ప్రయత్నాలు ఫలించడం లేదు.

లతకు వాళ్ళ నాన్న పెళ్ళి సంబంధాలు చూడసాగేడు. లత అప్పుడే పెళ్ళి వద్దంటున్నా ఎంత మాత్రం వినిపించుకోలేదు.

లత ఆందోళన చెందసాగింది.

"ఉద్యోగం దొరకక పోతే కొంపేం మునిగిపోదు. నా దగ్గర నగలున్నాయి. వాటితో వచ్చేస్తాను. ఎటన్నా పారిపోయి బ్రతుకుదాం. మీకు ఉద్యోగం వచ్చేవరకూ నా నగల్ని అమ్మి గడుపుదాం" అంది. ఆ పని చెయ్యడం నాకు ఎంత మాత్రం సమంజసంగా తోచలేదు.

లత నగల డబ్బు అయిపోయేలోగా నాకు ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ ఏమిటి? దొరకకపోతే మా భవిష్యత్ ఏమిటి? ఈ విషయాన్ని లతతో అంటే కోపగించుకుంది. దేనికైనా ధైర్యం వుండాలని నన్ను రెచ్చ

గొట్టడానికి ప్రయత్నించింది. తెగించి వెళ్ళకపోతే యింట్లో వాళ్ళు తన యిష్టా యిష్టాలతో ప్రమేయం లేకుండా వాళ్ళకు నచ్చిన సంబంధాన్ని తెచ్చి బలవంతంగా పెళ్ళి జరిపించేస్తారని కన్నీరు పెట్టుకుంది.

ఎటూ చెప్పలేకపోయాను.

లత మాటల్ని మన్నిస్తే, భవిష్యత్ మాట ఏమిటి? అలాగని లతను చూస్తూ చూస్తూ యిష్టంలేని పెళ్ళికి బలిగావించలేను.

మానసికంగా చిత్రవధను అనుభవించాను. ప్రేమ త్యాగాన్ని కోరుతుందంటారు. బాగా ఆలోచించి చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను.

"లతా ఉద్యోగంయింత తొందర్లో నాకు దొరుకుతుందన్న ఆశ లేదు ఉద్యోగం వచ్చి, నా కాళ్ళమీద నేను నిలబడేవరకూ నువ్వు వెయిట్ చేసే అవకాశం లేదు." అందుచేత - నేను ఆమె శ్రేయస్సు కోరి తన మనస్సు నుండి తొలగిపోవడానికి నిశ్చయించుకున్నాను.

అయితే, అదంత తేలిక కాదని తెలుసు.

లత నన్ను గాఢంగా ప్రేమించింది.

నాతోనే జీవితం అనుకుంది. నాకోసం కన్న తల్లిదండ్రులకు కూడా దూరం అవడానికి సిద్ధపడింది. అటువంటి వ్యక్తి, నన్ను మరిచిపోయి, అసహ్యించుకుని.... మరొకర్ని పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలి.

లత నాకు దూరమౌతుందనే బాధను గుండెల్లో దాచుకుని చిన్న అబద్ధం చెప్పాను.

"మా మేనమామకి బోలెడంత ఆస్తితోపాటు ఓ కూతురు వుంది. ఆ అమ్మాయిని నాకివ్వాలని అనుకుంటున్నారు. అఫ్‌కోర్స్! ఆ పిల్ల గుడ్డిది. ఆమె వెనకాతల వున్న ఆస్తికోసం.... పెద్దలమాటను కాదనలేక ఆమెను వివాహం చేసుకోక తప్పదు" అన్నాను లతతో.

నా మాటలకు నిలువునా నీరయిపోయింది లత. ఎంతగానో నన్ను తిడుతూ, శపిస్తూ, కన్నీరు కారుస్తుందనుకున్న నా అంచనా తారుమారు చేస్తూ, మరింక ఒక్క క్షణం కూడా నా ఎదుట నిలబడకుండా వెళ్ళిపోయింది...."

చెప్పడం ముగించాడు మురారి. గత స్మృతుల తాకిడికి చిహ్నంగా అతడికి ముహం జేవురించివుంది.

అంతవరకూ మురారి చెప్పింది ఉత్కంఠతో విన్న సంధ్య—

"ఆ తరువాత కథ ఏమైంది?" అవి ప్రశ్నించింది నైరాశ్యంగా. మందహాసం చేశాడు మురారి.

"అనుకున్నట్టుగా లత పెళ్ళి ఓ ఇంజనీర్‌తో జరిగిపోయింది. బ్రతుకుతెరువు కోసం నేను ఎన్నో అవతారాలు ఎత్తి.... చివరి కిక్కడ ఇలాగ స్థిరపడ్డాను" చెప్పాడు మురారి.

సంధ్య భృకుటి ముడిపడింది. ఏదో గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ, "మీ లత పూర్తి పేరు 'పద్మలత' కదూ?" అని ప్రశ్నించింది.

విస్మయంగా చూశాడు మురారి. అవునన్నట్టుగా తలాడించాడు.

"మీది.... మీది రాజమండ్రి కదూ?" సంధ్య ప్రశ్నలోని వణుకు మురారినికలవరపరిచింది.

"అవును" అన్నాడు.

"మైగాడ్! మా 'లత' ప్రేమించింది మిమ్మల్నే నన్నమాట!" అంది దీర్ఘంగా నిట్టూర్చి.

"లత నీకు తెలుసా?" అడిగాడు మురారి.

"తెలుసు. లత నా ప్రాణ స్నేహితురాలు. ఆ ఇంజనీర్‌తో పెళ్ళయిన తర్వాత లత జీవితంలో జరిగిన ఓ పెద్ద సంఘటన మీకు తెలియదు."

"ఏం జరిగింది?"

సంధ్య చెప్పిన లత కథ:

"కొన్ని కొన్ని జీవితాలు విచిత్రంగా మనం ఊహించలేనంతగా మలుపులు తిరుగుతూంటాయి. దురదృష్టవశాత్తూ 'లత' పాత డైరీ ఆమె భర్త చదవడం జరిగింది. అందులో మీ ప్రేమ వ్యవహారం వుంది. దాంతో, లత బ్రతుకు దుర్భరమై పోయింది. భర్త చేతుల్లో నానారకాల హింసలను అనుభవించింది. ఒక్కసారి లతే తన విషయాన్నంతా దీనంగా నాకు వ్రాసింది. ఆ పరిస్థితిలో మిత్రురాలిగా నేనేం సహాయం చెయ్యగలను...? చివరకు భర్త బాధల్ని భరించలేక ఆత్మహత్య చేసుకుంది!...."

"వ్హాట్?" అదిరిపడ్డాడు మురారి.

"అవును కిరసనాయిల్ పోసుకుని, నిప్పంటించుకుని చచ్చిపోయింది!" సంధ్య చెప్పిన విషయానికి మురారి మొహం పాలిపోయింది.

* * *

మెరుపు మరక:

మర్నాడు మురారి స్లీపింగ్ పిల్స్ మింగి ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త విని ఖిన్నురాలయింది సంధ్య.

మురారి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు?

దానికి కారణం?

ఎప్పట్నుండో సంధ్య మూగగా ఆరాధిస్తోంది. కాని ఆ ప్రేమను అతనికి చెప్పడానికి సాహసం చాల లేదు. ఏ రోజయినా అతని నోటి వెంట తనని ప్రేమిస్తున్నానని వినక పోతానా, అని ఎదురుచూసింది.

కాని, మరి యింతలోనే మురారి ఆత్మహత్య చేసుకున్నాడు!

మురారి గుర్తు కొస్తుంటే గుండె పిండుతున్నట్టవుతుంది. బాధను భరించలేక నిద్రమాత్ర ఒకటి మింగి పడుకుంది. మత్తుగా నిద్రపట్టింది.

ఈవెనింగ్ పోస్టులో వచ్చిన ఉత్తరం చదివి మరింత విస్తు పోయింది.

అది మురారి రాసిన మొదటి, చివరి ఉత్తరం!

ఆతృతగా కవరు చించి చదవసాగింది.

సంధ్యా,

ఈ ఉత్తరం నువ్వు చదివే సరికి నేనీ లోకంలో వుండను. నన్ను పిరికి వాడనుకుని అస హ్యించుకోకు. ఆనాడు లతను వదులుకున్నా, నిన్నటి వరకు లత నా మనసులోనే వుంది. లత వల్ల మిగిలిన అనుభూతులను తలచు కుంటూ బాధ కలిగినపుడల్లా తాగుతూ ఇంతకాలం గడిపేస్తూ వచ్చాను.

నా కారణంగా, నేనాడిన చిన్న అబద్ధం కారణంగా నా లత జీవి తం నాశనమైందనీ, చివరకు ఆత్మ హత్య చేసుకుందని తెలిసాక నాకు బ్రతుకు మీద విరక్తి కలిగింది. అందుకే నేనూ లతను చేరు కుంటున్నాను.

మురారి.

నిలువునా నీరయిపోయింది సంధ్య.

"ఎంత ఘోరం జరిగిపో యింది మురారీ! ఒకసారి నీ పాతడైరీ చూసి నీ ప్రేమకథను తెలుసుకుని లత కారణంగా నేను నీకు దగ్గర కాలేకపోతున్నా నని పించి, నీ మనసు మార్చాలని లత చచ్చిపోయిందంటూ నేను కల్పిం చిన కథ, నిన్ను బలి గొన్నదా? ఈ పాపం నాది....నాది....!" గుండె లోతుల్నుండి ఎగదన్నుకు వస్తున్న దుఃఖాన్ని ఆపలేక మంచం మీద కుప్పలా కూలి పోయింది సంధ్య. *

(మిత్రులు శ్రీ కళింకోట ప్రభాకరదేవ్, శ్రీ కొల్లూరు కోటేశ్వరావులకు కృతజ్ఞతలతో)